# పైశాచిక ప్రకృతి

(క థా ని క)

నిప్పులేకుండా పొగరాదు. అలాగే ఈ కథకు కూడా కొంత పునాదంటూ ఉండబట్టే ఇల్లు కట్టగలుగుతున్నా. బహుశా ఈ కథలోని వాతావరణంవల్ల దీన్ని మీరు నమ్మలేకపోవచ్చు. కాని, ఇది నిజంగా జరిగింది.

అసలీ సంఘటన జరిగి మూడేళ్లు కావచ్చింది. దీన్ని సృష్టించుదామన్న ఉద్దేశ్యం నా కప్పట్లో కలుగలేదు. ఏ హృదయ విదారక దృశ్యంవల్ల ఎక్కడైతే గాయం తగిలిందో అక్కడే మళ్ళీ చిన్న తగలటంవల్ల నేటికా ఉద్దేశ్యం కల్గింది.

ఒకరోజు సాయంకాలం మాచవరంనుండి విజయవాడ పోతున్నా. సిటి బస్సు దొరక్క నడిచిపోవాలిసి వచ్చింది. బాగా చీకటిపడ్డది. మధ్య రెండు మైళ్లు ఇంచుమించు నడవాలి. దారిలో ఒంటరిగా పోతూ ఉండటంవల్ల కొంచెం భయం భయంగా ఉంది.

ఇంతలో ఓ రిక్షా యెదురు కలసింది. అందులో ఓ వ్యక్తి కూర్చొన్నాడు. వయస్సు పాతిక సంవత్సరాలుంటాయిగాని బలవంతుడు కాదు. బక్కగా ఉన్నాడు. అతడు నన్ను పిలచి:—

"సరస్వతీ టాకీసెక్కడా?" అన్నాడు.

"ఎందుకు?" అన్నా. ఈ లోపునే రిక్షావాడు కొంత తత్తరపాటు చెందటం గమనించా. రిక్షా ఆగింది.

"నేను స్టేషనువద్ద ఈ రిక్షా ఎక్కాను. మాది పల్లెటూరు. ఓ సినిమా చూడాలని బుద్ధి పుట్టింది. నావద్ద మా చెల్లి పెండ్లికోసం బట్టలు తెచ్చేందుకు తీసుకొనివచ్చిన డబ్బు-ఐదువందలు ఉన్నది. నేనెప్పుడూ ఈ ఊరు రాలేను. ఇదే ప్రథమ పర్యాయం. కాని, వీడేదో అడవిలోకి తీసుకొనిపోతూ ఉన్నట్లు కనిపిస్తోంది" అన్నాడు.

ఆ రిక్షావాడు చేసే ఘోరం నాకప్పుడు అర్థమైంది. నేను నిజం బయటపెట్టా. ఇలా తీసుకొని వచ్చాడంటే ఏదో ద్రోహం తలపెట్టి ఉంటాడని కూడా చెప్పా. వెంటనే ఆ వ్యక్తి రిక్షా దిగి వాణ్ణి వర్ణించవలవికానట్లు కొట్టాడు. నా మేలుకు కృతజ్ఞత తెలుపుతూ సినిమాకి రమ్మంటూ బలవంతంచేయ మొదలుపెట్టాడు. దాంట్లో:"ఇలాంటి ఘోరాలు జరుగుతూ ఉంటాయండి?"

"అంతా అలా ఉండరండి. ఎవరో హృదయంలేని వెధవలు ఇలాంటి పనులు చేస్తూ ఉంటారు అందుకనే బస్తీకి వచ్చేటప్పుడు— అందులో మీలాంటి కల్లా కపటం ఎరుగని వాళ్లు వచ్చేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.

"మూడు సంవత్సరాల క్రిందట, ఈ ఏలూరు రోడ్డుమీద, ఈ మూడురోడ్లు కలసినచోట, ఇక్కడ జరిగిన సంఘటన తెలుపుతా వినండి." అంటూ మొదలుపెట్టాను.

"వాళ్ళదేవో పల్లెటూరని జ్ఞాపకం. పేరు శివరావు. భార్య పేరు జానకి. ఆయన అత్తవారూరు బెజవాడ. జానకిని పుట్టింటిలో దిగబెట్టి వచ్చేందుకు శివరావుకు వీలు చిక్కలేదు. ఎన్నో పనులలో మునిగి ఉండటం వల్ల భార్యను ఒంటరిగా పంపవలసి వచ్చింది.

"తను రాలేనని, భార్యను పంపుతున్నానని, స్టేషనుకు వచ్చి భార్యను తీసుకొని పోవలసిందని" మామగారి కిదివరకే ఉత్తరముఖంగా తెలిపాడు. ఎవరో నలుగురు ఆడవాళ్లుంటే వాళ్ళతో కలిపాడు. అంతేగాక, ఒకవేళ మామగారు స్టేషనుకు రానిపక్షంలో జానకి చేయవలసిన విధి కూడా తెలిపాడు:—

"స్టేషను దిగగానే, నదురు బెదురు లేకుండా ఏ రిక్షావాణ్ణో 'వక్కలరోడ్డు'కు కట్టించు. అక్కడ దిగితే కనుక్కోగలవుగా. ఇప్పుడే టెలిగ్రాం కూడా ఇచ్చి వచ్చా" అంటూ చెప్పాడు.

యాముజాల శంకరం

“అసలు ఇంటిదగ్గరనే, భార్య బయలుదేరే ముందు, వంటిమీద వస్తువులన్నీ తీయించి పెట్లో పెట్టించాడు. మామూలు చీరె కట్టించాడు. అలంకరించుకుంటే, అందంగా కనిపిస్తే, ఎవరైనా ఏమైనా చేయవచ్చని అనుమానపడి, ఈపని చేయించాడు. ఆమె అందం వర్ణించాలంటే చాలా కష్టం. ఒక్క ముక్క చెప్తాతా. అప్పటికి జానకి, మబ్బు ముక్కల మాటున మణిగి, అలా అలా కనుపించే, ఆ రాకాసుధాకర బింబం అంటే సరిపోతుంది.

బండి బయలుదేరుతూ ఉంటే కంటివెంట నీళ్ళొచ్చాయి శివరావుకు. భార్యా భర్తల మధ్య ఇంతింత అనరాని అనురాగముంది. అది ప్రేమ కానీయండి, కామం కానీయండి. మరేమైనా కానీయండి. ఏమైనప్పటికి వారి హృదయాలు అంత గాఢంగా, అంతదగ్గరగా హత్తుకున్నాయంటే మీరు విశ్వసింపలేరు.


కంటివెంట నీరు చూచి జానకి నవ్వింది. భర్తను ఓదార్చి పంపింది. కాని, ఆ దుఃఖం ఆ విరహం ఎంత కష్టంగా దిగమింగిందో ఆ పరమాత్ముడికే తెలియాలి.

ప్రక్క రెండు స్టేషన్లు దాటాయి. మూడవ స్టేషనులో ప్రక్క స్త్రీలు దిగిపోయారు. ఆ ఇంటరు క్లాసులో జానకి ఒక్కర్తే కూర్చొని ఉంది. ఉండగా, ఉండగా ఆమెకో దుర్బుద్ధి పుట్టింది. పోయేది బస్తీకి గదా. ఆ నెక్‌లెస్, ఆ మూడు పేటల చంద్రహారం పెట్టుకుంటే ఎంత బాగుంటుంది అనుకుంది. వెంటనే పెట్టెదించింది. దువ్వెనతో జుత్తు సరిదిద్దింది. శుభ్రంగా ముఖం కడిగి, పౌడరు కొట్టింది. రెండూ మెళ్లో వేసింది. ఎప్పుడూ వళ్లంతా పమిటతో కప్పే స్త్రీ, సగం భాగం బయట పారేసింది. కుడి ప్రక్క బుజంమీద పమిట లేక పోవటంవల్ల, కనకాంభరణాలు తళతళా మెరుస్తున్నాయి. నిజం చెప్పాలంటే అచ్చంగా అపర రంభలాగ ఉంది

బెజవాడ స్టేషనులో బండి ఆగింది. కాని తన వారెవరూ రాలేదు. ఒకవేళ వచ్చారేమో వచ్చి ఎటైనా వెళ్ళారేమో, కాసేపు చూద్దామనే ఊహాకు తావివ్వలేదు. తనొక్కర్తే వెళ్లి ఇంటిదగ్గర “చూడండి! ఒక్కదాన్ని ఎలారాగలిగానో!” అని గప్పాలు చెప్పకోవాలనుకుంది. అందుకని స్టేషను దాటి రిక్షానొకదాన్ని బేరం చేసింది.

అసలప్పటికో గంటనుండి ఆకాశమంతా మేఘావృతమై ఉంది. అంతేగాక రవ్వజల్లు కూడా రాలుతోంది. స్టేషను దాటి రిక్షాలో కూర్చునేసరికి, జల్లు ప్రవాహంగా మారింది. అందుకని రిక్షావాడు రిక్షాముందు ముసుగు వేశాడు, తుప్పెళ్లలోనికి దూసుకొని పోకుండా ఉండేందుకు.

అనుకున్న నక్కలరోడ్డు దాటిపోయింది. ఏలూరు రోడ్డు (దీన్నే గ్రాండ్ ట్రంక్ రోడ్డు అంటారు) మీదపడి నీళ్లలో నడచి పోతోంది రిక్షా. కొంతదూరం పోయేసరికి, అ—నే చెప్పిన— మూడురోడ్ల సెంటరు చేరుకుంది. అక్కడ నుండి కేక వేసినా, అది అక్కడే అంతమవు.



తుంది కాని ఎంతో దూరం పోదు. రిక్షా ఆగింది. ముసుగు తీయబడింది. ఆమెను క్రిందికి దిగమన్నాడు రిక్షావాడు. ఎందుకో అని ఆ అమాయకురాలు దిగింది. వెంటనే వాడు, సీటు పైనున్న దిండులాంటి మెత్తను తొలగించాడు. క్రింద ఓ పెట్టె ఉంది. మూత ఎత్తి లోనుండి బాకు పైకి తీశాడు. వెంటనే ఆమె రొమ్ముల్లో పొడిచాడు. కాని బంగారం అడ్డంగా ఉండబట్టి బాకు బాగా దిగలేదు. ఆమె కంగారుపడుతూ విషయాన్ని గ్రహించి, వస్తువులతీసి అందిస్తూ వదలిపెట్టమని కాళ్ళా వేళ్ళా పడింది. కాని ఆ కఠిన కర్కశ కిరాతకుడా మొరాలకింపక:

“వదలితే నేను బయట పడిపోతాను” అంటూ మళ్ళీ పొడిచాడు.

ఆమె తప్పించుకొని చెప్పనంటూ అర్రో మొర్రో అంటూ అరవటం మొదలుపెట్టింది. గట్టిగా కౌగలించుకొని కత్తితో పొడిచాడు. హాః. అంటూ నేల కొరిగింది. ఎన్నిసార్లు పొడిచాడో వాడికే తెలియదు. వేడి రక్తం వెల్లువై పారింది.

* * *

టెలిగ్రాంకు సమాధానం రాక శివరావు గాభరాపడ్డాడు. వెంటనే బయలుదేరాడు. విజయవాడలో దిగాడు, స్టేషనుదాటి రిక్షా మాట్లాడుకుందామనే సరికి, ఓ ఝరీ అంచు తలగుడ్డ చుట్టుకున్న ఓ రిక్షావాడు ముందుకొచ్చాడు.

ఆ అంచు చూడగానే శివరావు అనుమానపడ్డాడు. ఆ అంచు చీరే శివరావు పెండ్లినాడు పెండ్లానికి పెట్టాడు. అంతేగాక పుట్టింటికి పోతున్న ప్రియురాలికోసం, ఓ కొత్త సిల్కు చీర కొని పెట్టాడు. ఆ గళ్ళచీర అంచు చించి, మొలకుచుట్టినట్లు గుర్తు పట్టగలిగాడు. ఇలాంటి గుర్తులతో గుండె బేజారెత్తిపోయింది. ఐనా ఓర్మి వహించి, ఇంటి కారిక్షాయే మాట్లాడాడు. ఇంటివద్ద భార్య లేదు. రిక్షా అమాంతం స్టేషన్‌కు కట్టించాడు. ఇన్స్పెక్టరుకు వప్పజెప్పాడు. అక్కడ ఇన్స్పెక్టరు చావ గొట్టగా నిజం బయటపడింది.

ఆ రిక్షావాడా బంగారం ఏం చేయాలో తోచక ఆ మూల గొందిలో, ముంతలో బెట్టి, మామిడి గున్న క్రింద, మట్టిలో పెట్టాడు.

ఆ మృతకళేబరం అలా రోడ్డుప్రక్క నీళ్ళలో నానుతూ, ఎండలో ఎండుతూ అలా పడి ఉంది. వచ్చేపోయే బాటసార్లు, కాలేజీ కుర్రాళ్ళూ చూచి కన్నీరు కర్చేవారు. కడకు దహనం చేశారు.

ఆ బూడిద దగ్గర శివరావు పిచ్చివాడుగా తిరిగేవాడు. బూది రెండు చేతులతో ఎత్తి కళ్ళకద్దుకుంటూ ఉండేవాడు. లేకపోతే “జానకీ!” అంటూ అరిచి, ఆ బూడిదలో పడి పొర్లాడేవాడు. అందులో అతనికి భార్యను కౌగలించుకుంటున్నంత ఆనందం కలిగేది. అలా ఎంతసేపున్నాడో అతనికే తెలియదు. మామగారూ వాళ్లు వెతుక్కుంటూ వచ్చారు. ఏమిలాభం! ఆ బూడిదను కౌగలించుకొని, హృదయానికి గాఢంగా హత్తుకొని అలా నేపడి ఉన్నాడు- మాటా లేదు, పలుకూ లేదు.”

లండన్, డిసెంబర్ 2—“యంత్రమానవుల” సహాయంతో పనిచేసే ఒక పెద్ద ఫ్యాక్టరీకి రష్యాలో ప్రారంభోత్సవం జరుపబడినట్టు నేడు “టాస్” వార్తా సంస్థ ప్రకటించింది.

మోటారుకారు ఇంజన్ పిస్టన్‌లు తయారుచేయబడే ఈ కర్మాగారంలో నలుగురు మాత్రమే మనుష్యులు పని చేస్తారనీ, తక్కిన పనులన్నీ కూడా యంత్రాలచేతనే నిర్వహించబడగలవనీ ఈ వార్తలో వివరించబడింది. అయితే, ఇది స్థాపించబడిన ప్రదేశం మాత్రం పేర్కొనబడలేదు.

మొత్తం ప్రపంచంలో ఇట్టి ఫ్యాక్టరీ ఇది ఒక్కటే కలదట.